క్లుప్తంగా

సత్తాచాటిన వేల్పూరు విద్యార్థులు



శావల్యాపురం: నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసోర్స్ శిక్షణ సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళాత్సోవ పోటీల్లో వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతి రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి 13 జిల్లాల స్థాయిలో నిర్వహించిన జానపద నృత్యం కోలాటం ప్రదర్శన కార్యక్రమంలో మంచి ప్రతిభ చూపి రెండవస్థానం సాధించటం అభినందనీయమన్నారు. కోలాట ప్రదర్శన కార్యక్రమంలో విద్యార్థులు నాగరోషిని, మస్తాన్‌బీ,శ్రావణి, అక్షయ్‌లు పాల్గొనగా గైడు టీచరుగా జె.శ్రీనివాసరావు వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, వ్యాయమ ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్ ఉన్నారు.

వర్సిటీ ఫుట్‌బాల్ జట్టుకు వాసవీ విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫుట్‌బాల్ జట్టుకు వాసవీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ పి.చంద్రశేఖర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ బి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఈనెల 7, 8 తేదీలలో నిర్వహించిన అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్, వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు షేక్.నాగషరీఫ్, సయ్యద్ ఖాజాపీర్‌లు ప్రతిభ కనపరిచి వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి పి.పవనజ్యోతి, డైరెక్టర్ వి.శ్యామ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఆక్రమణల తొలగింపు నిలిపివేయాలి

- లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం
- హెచ్చరించిన ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి

నరసరావుపేట: పట్టణంలో డ్రెయిన్‌లు, ఫుట్ పాత్‌లపై వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులను ఆక్రమణ పేరుతో తొలగించే కార్యక్రమాన్ని వెంటనే విరమించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మున్సిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు అద్దెలు చెల్లించే సోమేతలేక ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలు, ఫుట్ పాత్‌లు, రోడ్డు మార్జిన్లలో వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాలకు జీవన భృతి కలిగిస్తున్నారన్నారు. వీరందరూ ప్రతిరోజు పురపాలకసంఘానికి పన్నులు చెల్లిస్తున్నారన్నారు. అలాంటి వారి షాపులు తొలిగిస్తే వారి కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. పురపాలక అధికారులు దీనిని గుర్తించి వెంటనే ఆక్రమణల తొలగింపు నిలిపివేయాలని, లేనిపక్షంలో బాధ్యులతో మున్సిపల్ కార్యాలయం ముట్టడించి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సమస్యల వలయంలో గురుకులం

- పెదతురకపాలెంలో ఎస్టీ బాలుర పాఠశాలలో సమస్యల తిష్ట
- కాంపౌండ్‌వాల్ లేకపోవడంతో భయాందోళనలో విద్యార్థినులు
- తరగతి గదుల్లో విషసర్పాలు దర్శనం
- వర్షం వస్తే బురదమయంగా రహదారి
- పాఠశాలకు రావాలంటే ఉపాధ్యాయులకు చుక్కలు



గురుకుల పాఠశాల భవనం

నరసరావుపేట రూరల్: పెదతురకపాలెంలోని ఎస్టీ గురుకుల బాలికల పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. కోట్లాది రూపాయల వ్యయంతో పాఠశాల ప్రాంగణాన్ని సిద్ధం చేసినప్పటికీ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పాఠశాలలోని విద్యార్థినులు చీకటిపడితే చాలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. దీంతో పాటు ప్రాంగణంలో ముళ్ల పొదలు పెరిగిపోవడంతో విషసర్పాలు తరగతి గదుల్లో సైతం సంచారం చేస్తున్నాయి.

170 మంది విద్యార్థినుల నివాసం

పెదతురకపాలెంలోని ఎస్టీ గురుకుల బాలికల పాఠశాలలో 170 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, అప్పటి జిల్లా కలెక్టర్ శివశంకర్ చొరవతో ఈ ఏడాది ఫిబ్రవరిలో నూతన ప్రాంగణంలో తరగతులు ప్రారంభించారు. ఆ సమయంలో కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఆరు నెలలుగా పనుల్లో పురోగతి లేదు.

అధ్వానంగా రహదారి

పాఠశాలకు వచ్చే రహదారి అధ్వానంగా మారింది. పెదతురకపాలెం గ్రామానికి కూతవేటు దూరంలోనే ఈ పాఠశాల ఉన్నా ఆ కాస్త దూరం పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులకు నరకం కనిపిస్తోంది. నల్లమట్టి రోడ్డు కావడంతో వర్షం పడితే కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఉపాధ్యాయులు గ్రామంలోనే ద్విచక్ర వాహనాలను నిలిపి బురదలో నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు.

విద్యార్థినుల్లో భయాందోళన

గురుకుల పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నా కాంపౌండ్ లేకపోవడంతో విద్యార్థినులు భయాందోనలు చెందుతున్నారు. మెయిన్‌గేటు వైపు మాత్రమే కాంపౌండ్ వాల్ నిర్మాణం చేశారు. మిగిలిన అన్ని వైపులా కాంపౌండ్‌వాల్ లేదు. ఆయా ప్రాంతాల్లో మైనార్టీ వసతి గృహం, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయి ఉన్నాయి. దీంతో ఆప్రాంతం చీకటి పడితే చాలు నిర్మానుష్యంగా మారి విద్యార్థినులు రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా పాఠశాల చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోవడంతో విషసర్పాలు వసతిగృహంతో పాటు తరగతి గదుల్లో దర్శనమిస్తున్నాయి. పట్టపగలే తరగతి గదుల్లో పాములు వస్తుండటంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.



ముళ్ల పొదలతో నిండిపోయిన ప్రాంగణం

కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలి



పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలున్నాయి. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో హాస్టల్ నుంచి కూడా బయటకు రాలేకపోతున్నాం. కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలి.

-పావని భాయ్, విద్యార్థిని

పాముల బెడద అధికంగా ఉంది



మూడు రోజుల క్రితం కూడా తరగతి గదిలోకి పాము వచ్చింది. దీంతో విద్యార్థినులు అందరం భయంతో బయటకు పరుగులు తీసాం. కాంపౌండ్ వాల్ లేకపోవడం, ముళ్లపొదలు అధికంగా ఉండటంతో తరచూ పాములు వస్తున్నాయి.

-అనూషభాయ్, విద్యార్థిని

త్వరలోనే నిర్మాణాలు పూర్తిచేస్తాం

పాఠశాలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఇప్పటికే అంచనాలు తయారీ చేసి ఉన్నతాధికారులకు అందజేశాం. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వచ్చే నిధులతో త్వరలోనే కాంపౌండ్ వాల్, అంతర్గత రోడ్లు తదితర సమస్యలను పరిష్కరిస్తాం.

- కె వెంకటసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేట టౌన్: ఆర్టీసీ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు తెలిపారు. నియోజకవర్గంలోని నాదెండ్ల, ఎడ్లపాడు, చిలకలూరిపేట మండలాల పరిధిలో ఆర్టీసీ సర్వీసులకు సంబంధించిన సమస్యలు, ఆయా సమస్యల పరిష్కారానికి తగు సలహాలు సూచనలు అందజేయాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రయాణికుల తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లిపర: విద్యుత్ 33కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం అన్నవరం, దావులూరు ఫీడర్ పరిధిలో బుధవారం సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ మండల ఏఈ ప్రదీప్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం ఫీడర్ పరిధిలో అన్నవరం, గౌడపాలెం, బొమ్మువానిపాలెం, హనుమాన్‌పాలెం, తూములూరు, దావులూరిపాలెం, దావులూరు ఫీడర్ పరిధిలో జెముడు బాడు గ్రామాలకు బుధవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

22న 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు సన్మానం

నరసరావుపేట ఈస్ట్: తహసీల్దార్ కార్యాలయ అవరణలోని పెన్షనర్ భవన్‌లో ఈనెల 22వ తేదీన పెన్షనర్స్ డేను పురస్కరించుకొని 75 సంవత్సరాలు వయస్సు నిండిన పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించనున్నట్లు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ జి.ప్రభుదాస్, ఇతర రాష్ట్ర నాయకులు హాజరవుతారని, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటిస్తారని వివరించారు. అసోసియేషన్ సభ్యులు, 75 సంవత్సరాలు నిండిన సన్మాన గ్రహీతలు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రెవెన్యూ సభలు సద్వినియోగం చేసుకోండి



కనమర్లపూడిలో రైతు నుంచి అర్జీను తీసుకుంటున్న తహసీల్దారు కె.సుజాత



చిరుమామిళ్ళ గ్రామ సభలో అర్జీ అందిస్తున్న రైతు

శావల్యాపురం: రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె.సుజాత అన్నారు. మంగళవారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ భూపరమైన సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు దోహదపడతాయన్నారు. రీసర్వేకు సంబంధించి తప్పులు సవరణలు, మార్పులు, చేర్పులు కొలతలు వ్యత్యాసం తదితర వాటిపై 20 అర్జీలు రైతుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. గ్రామసభలో వచ్చిన అర్జీలను ప్రత్యేక రిజిష్టరులో నమోదు చేస్తామన్నారు. ఈ గ్రామసభలో డిప్యూటీ సర్వే తహసీల్దారు పేరుసోముల నాసరయ్య,సర్వేయర్ యం.రాజు, వీఆర్వోలు నరసింగరావు, రమాదేవి రైతులు పాల్గొన్నారు.

చిరుమామిళ్లలో...

నాదెండ్ల: చిరుమామిళ్ళ గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. సభకు ఏడు అర్జీలు అందాయి. డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, మండల సర్వేయర్ రాంబాబు, గ్రామ సర్వేయర్ ఉషాంజలి, వీఆర్వో ప్రేమ్‌రాజ్, దేవాదాయశాఖ ప్రతినిధి త్రిపురారెడ్డి హాజరయ్యారు. రైతుల నుంచి ఏడు అర్జీలు అందాయి. రీసర్వేలో భూముల కొలతల్లో తేడాలను సరిచేయాలంటూ ఐదు అర్జీలు దాఖలు కాగా, పాసు పుస్తకాలు కావాలంటూ రెండు అర్జీలు అందాయి.

యడ్లపాడు: రెవెన్యూ సంబంధిత సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ చెప్పారు. మంగళవారం మైదావోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో రెవెన్యూ సదస్సులో పరిష్కరిస్తున్న వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించా రు. అనంతరం భూ సంబంధిత సమస్యలపై గ్రా మానికి చెందిన ఇరువురు రైతులు రెండు దరఖాస్తులను అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సర్వేయర్ వీర సురేంద్రనాథ్, గ్రామస్థాయి అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రెవెన్యూ సదస్సుకు 11 దరఖాస్తులు అందాయన్నారు. 9 దరఖాస్తులు తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మరో రెండు దరఖాస్తులు తమ భూములను సర్వే చేయాలని వచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ బండి నిర్మల అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్ఐ కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం నుంచి గ్రామాలు విముక్తి కావాలి

- ఎంపీడీవో హేమలతాదేవి
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణపై శిక్షణ షురూ

యడ్లపాడు: పేదరికం గ్రామాల నుంచి బహిష్కరించే దిశగా ప్రజలకు మెరుగైన జీవనోపాదులు సృష్టించాలని ఎంపీడీవో వి.హేమలత దేవి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతా దేవి మాట్లాడుతూ 2030 నాటికి ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో మండలం జిల్లాలో ప్రథమంగా ఉంచేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. మండలంలోని 148 మందికి రెండు బృందాలుగా నాలుగు రోజులపాటు సమగ్రంగా ఇచ్చే ఈ శిక్షణ ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు ఎంత దోహద పడుతుందన్నారు. అనంతరం జిల్లా రిసోర్స్ పర్సన్ పేదరికం లేని జీవనోపాదులో సృష్టి, ఆరోగ్యవంత గ్రామం, బాలహితం, సమృద్ధిగా నీరు, పచ్చదనం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్ హుస్సేన్

-పరిశుభ్రత, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక న్యాయం, భద్రత, సుపరిపాలన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణకు హాజరైన అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిక్షణలో ఈఓపీఆర్డీ షేక్ జాకీర్ హుస్సేన్, ఏవో కే ఎస్ బి.సాయి శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయితీ, సచివాలయ కార్యదర్శులు హాజరయ్యారు.

నరసరావుపేట రూరల్: గ్రామాలు సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా కృషిచేయాలని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిక్షణా తరగతులకు వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో కృష్ణకుమారి, ఈవోపిఆర్‌డి నాగానంద్, సీడీపీవో సి.హెచ్. ఉమామహేశ్వరిలు శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు. ఎల్ఎస్‌డీజీఎస్ కార్యక్రమంపై ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణకుమారి, సీడీపీవో ఉమామహేశ్వరి

పొలంబాట - దిగుబడి మాట

వేర్వేరు ప్రాంతాల్లో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఈపూరు(శావల్యాపురం): పంట కోత ప్రయోగం వలన దిగుబడులు అంచనా వేయటానికి దోహదపడుతుందని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. మంగళవారం ఈపూరు గ్రామంలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగం బూదాల సురేష్ రైతు పొలంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ 5 మీటర్ల పంట కోత ప్రయోగం చేయగా 17.200 కేజీలు వచ్చినట్లు తెలిపారు. ఒక్కో ఎకరానికి 32 నుంచి 35 బస్తాలు దిగుబడులు వచ్చినట్లు ఏడీఏ అన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ విస్తరణా అధికారి బి.అప్పారావు, కిషోరుకుమార్, వీఏఏ యం.శేషుబాబు,భీమా పథకం పర్యవేక్షకులు సి.హెచ్.శ్రీను, రైతులు పాల్గొన్నారు.

వరిలో పాము పొడ తెగులుకు నివారించాలి

నరసరావుపేట రూరల్: వరిలో పాము పొడ తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని గురవాయపాలెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో నరేంద్రబాబు పాల్గొని వరి పంటను పరిశీలించారు. వరి పంటలో పాము పొడ తెగులును గుర్తించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. వరి పైరు పిలకలు వేసి దుబ్బు చేసే సమయంలో ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు.

నూతన వంగడాలపై ఆసక్తి చూపాలి

యడ్లపాడు: రైతులు మూస ధోరణికి స్వస్తి చెప్పి నూతన వంగడాలపై ఆసక్తి చూపాలని అప్పుడే అధిక దిగుబడులను సాధించే వీలు ఉంటుందని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నగేష్ చెప్పారు. మంగళవారం యడ్లపాడు, మైదవోలు గ్రామాలలో వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నగేష్ పలు నూతన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల శిక్షణ కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి పాల్గొన్నారు.

చిలకలూరిపేట: మిరపలో నల్లతామర నివారణకు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన అధికారి వి.విశాల్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల, కావూరు



ఈపూరులో వరి పంట కోత ప్రయోగంలో సూచనలు చేస్తున్న ఏడీఏ రవిబాబు

గ్రామాలలో మిరప పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపలో నల్లతామర పురుగు నివారణకు ఎకరాకు 200 కేజీల వేపపిండి భూమిలో వేయాలని తెలిపారు. దీని వలన తామర పురుగు యొక్క కోశస్థ దశలను నియంత్రించవచ్చు అని తెలిపారు.

వరిపంటకు ఇన్సూరెన్స్ ద్వారా నష్ట నివారణ

చిలకలూరిపేట: వరిపంటకు ఇన్సూరెన్స్ చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోకుండా పరిహారం పొందవచ్చని ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జనరల్ మేనేజర్ లింగయ్య చెప్పారు. యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామాలలో పంట పొలాలను జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం నగేష్, వ్యవసాయాధికారులు మంగళవారం సందర్శించి, పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి శ్రీలత,వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వినుకొండ(నూజెండ్ల): పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని నడిగడ్డ, దొండపాడు గ్రామాల్లోని కంది, వరి, మిరప పంటలను వ్యవసాయాధికారులు క్షేత్రసందర్శన చేశారు. ఈ సందర్భంగా ఏవో కె.అంజిరెడ్డి మాట్లాడుతూ కంది పంటలో శనగ పచ్చపురుగు ఉధృతి ఉన్నట్లు గమనించామని, నివారణకు ఇండోక్సకార్బ్ 200ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలన్నారు.

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పైర్లను పరిశీలించారు.

డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో అరుదైన శస్త్ర చికిత్స

ఫెరిఫెరల్ యాంజియో ప్లాస్టీ ద్వారా పేషెంట్ కాలు కాపాడిన వైద్యులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో తొలిసారిగా పెరిఫెరల్ యాంజియో ప్లాస్టీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పేషెంట్‌ను కాపాడినట్లు డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్డియాలజిస్టు డాక్టర్ కోటా శబరిగిరీష్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన శ్రీనివాసరావు నియంత్రణ లేని మధుమేహం, అధిక ధూమపానం సేవించటంతో కాలుకు పుండు ఏర్పడి ఆ కాలు తొలగించాల్సిన పరిస్థితిలో తీవ్రమైన అనారోగ్య సమస్యతో హాస్పిటల్‌కు వచ్చారన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ కోటా శబరిగిరీష్ పర్యవేక్షణలో అతడికి యాంజియోగ్రామ్ నిర్వహించి కాలు మొత్తానికి రక్తాన్ని సరఫరా చేసే నాళంలో బ్లాకులు ఏర్పడి రక్తం ప్రసారం కావట్లేదనే విషయాన్ని గుర్తించటం జరిగిందన్నారు. దీనిపై పేషెంట్‌కు పరిస్థితి వివరించి అతని ఆమోదంతో కాలు రక్తనాళాలలో బ్లాకుల వద్ద స్టంట్‌లు అమర్చి అంగవైకల్యం కలగకుండా కాపాడటం జరిగిందన్నారు. పల్నాడులో ఇదే తొలిసారిగా ఇటువంటి శస్త్ర చికిత్స తమ హాస్పిటల్‌లో నిర్వహించామన్నారు. ఇలాంటి అరుదైన ఆపరేషన్స్ చేసే హాస్పిటల్‌ను పల్నాడు, పశ్చిమ ప్రాంత ప్రకాశం జిల్లా వాసులు అందరూ వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. వైద్య సిబ్బందిని అభినందించారు. సమావేశంలో పేషెంట్ శ్రీనివాసరావు తన అనుభవాలను తెలిపారు.



హాస్పిటల్‌లో పేషెంట్‌తో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శబరి గిరీష్

స్మార్ట్ మీటర్లు తొలగించాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యుత్ వినియోగదారులపై పెను బారం మోపుతూ కూటమి ప్రభుత్వం బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లును వెంటనే తొలిగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నదని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నదని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి విద్యుత్ ఛార్జీలను పెంచుతున్నదని ఆరోపించారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించి ధర్నా అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏరియా కార్యాదర్శి చక్రవరం, సత్యనారాయణ రాజు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పటపాటి రంగయ్య, జక్రం డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏం చేస్తాం... నిధులు ఖర్చయిపోయాయి!

గణపవరం-జంగాలపల్లె డొంక మరమ్మత్తులపై ఆర్‌అండ్‌బీ అధికారుల మాట


సాక్షి ఎఫెక్ట్

నాదెండ్ల: చిలకలూరిపేట శివప్రియనగర్ నుంచి గణపవరం, నాదెండ్ల మీదుగా జంగాలపల్లె వరకూ వెళ్ళే డొంకరోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యతా లోపాలున్నాయని సాక్షిదినపత్రికలో సోమవారం నాణ్యత డొల్ల - రహదారి గుల్ల అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. ఆ శాఖ ఏఈ రవీంద్ర గణపవరం శివప్రియనగర్ సమీపంలో రోడ్డు పనులు పరిశీలించారు. ప్యాచ్‌వర్క్ గ్రావెల్ చెల్లాచెదురవటం, కొన్నిచోట్ల ప్యాచ్ వర్క్‌లను చేయకపోవటం పరిశీలించారు. గతంలో రోడ్డు గుంతలు ఎలా ఉన్నాయో అలాగే ఉండటం గమనించారు. అనంతరం సాక్షితో ఆయన మాట్లా డుతూ 13 కిలోమీటర్ల మేర డొంక మరమ్మతు పనులకు రూ.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. జంగాలపల్లె, సంకురాత్రిపాడు గ్రామాల మధ్య జరిగిన పనులకు నిధులు ఖర్చయ్యాయని, మిగిలిన చోట ప్యాచ్‌వర్క్‌లు చేసేందుకు నిధులు లేవని పేర్కొన్నారు. గణపవరం పెట్రోల్ బంకు వద్ద నుంచి నాదెండ్ల వరకూ ప్యాచ్‌వర్క్‌లు చేయలేమని పేర్కొనటం విశేషం. రోడ్డు మరమ్మతు పనులు అధ్వానంగా చేయటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పనులు పూర్తిస్థాయిలో చేయాలని కోరుతున్నారు.

గళమెత్తి.. నినదించి..

నిరసన వ్యక్తం చేసిన కమ్యూనిస్టు నాయకులు

వినుకొండ(నూజెండ్ల): సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్ వద్ద డిమాండ్స్ డే నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం 2014 అధికారంలోకి వచ్చినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఎన్నికల ప్రచారంలో ఇస్తామన్న మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీని నిలబెట్టుకోవాలన్నారు. అమెరికాలో అదానిపై కోర్టుల్లో వేసిన కేసులపై అదాని, సోలార్ ఎనర్జీ ఒప్పందాలపై పార్లమెంట్‌లో జేపీసీ వేసి విచారణ చేయాలన్నారు. ఈ డీసీటీఐలతో విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని, కరెంట్ ట్రూ అప్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, మణిపూర్ రాష్ట్రంలో మైనార్టీ తెగల పై జరుగుతున్న మారణకాండపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, రాము, వెంకటేశ్వర్లు, రామారావు, వందనం కిషోర్, పవన్ కుమార్ బూదాల చిన్న పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు

పశుగణనకు ప్రజలు సహకరించాలి

రొంపిచర్ల: పశు గణన కార్యక్రమానికి పశుపోషకులు అందరూ సహకరించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె. కాంతారావు అన్నారు. మండలంలోని విప్పర్లపల్లి, ముత్తనపల్లి, సుబ్బయ్యపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న పశుగణన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. మండలంలో 30 శాతం మేర పశు గణన పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 తేదీ వరకు కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో పశు గణన కార్యక్రమ వివరాలను ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వంశీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.